క్లుప్తంగా

పనుల పరిశీలన

మాక్లూర్: అడవి మామిడిపల్లి శివారు చిన్నాపూర్ గండిలో రూపు దిద్దుకుంటున్న అర్బన్ పార్కును మంగళవారం అదనపు డీఆర్‌డీవో సంజీవ్ సందర్శించారు. ముందుగా గ్రావెల్ పోసిన పనులను పరిశీలించి, పార్కు లోపల జరుగుతున్న కల్వర్టుల నిర్మాణం, ఇతర పనులను అక్కడ ఉన్న ఫారెస్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగితా పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో క్రాంతి, ఉపాధి హామీ ఏపీవో ఓంకార్ ఉన్నారు.

జీవాలకు 'నట్టల' మందు

మాక్లూర్: అడవి మామిడిపల్లిలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించి 7,538 జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేశారు. మండల పశు వైద్యాధికారులు ఉమామహేశ్వర్, కిరణ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులు వేయించారు. స్థానిక సర్పంచ్ చింత మల్లారెడ్డి, పశువైద్యా సిబ్బంది జైల్‌సింగ్ పాల్గొన్నారు.

చెంగల్‌లో..

భీమ్‌గల్: చెంగల్‌లో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి కృష్ణ మాట్లాడుతూ.. చేంగల్ గ్రామంలో మొత్తం 2,809 గొర్రెలు, మేకలకు మందులు వేశామని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మండల ప్రజాప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 25 మందికి కల్యాణలక్ష్మి, 10 మందికి షాదీముబారక్ చెక్కులను అందజేశారు. తహసీల్దార్ సురేష్, ఎంపీపీ గౌతమి, సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

వేల్పూర్: మండల కేంద్రంలో మంగళవారం కన్నెపల్లి గంగుబాయి, బాలయ్య, కనికరం హరిణికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, నోముల రవీందర్, మొండి మహేశ్, దత్తు పాల్గొన్నారు.

బోనాల ప్రదర్శన



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ కళాశాలకి చెందిన విద్యార్థులు తెలంగాణ యూనివర్సిటీ తరపున జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరుగుతున్న జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారని కళాశాల డైరెక్టర్ నవీన్ యాదవ్ తెలిపారు. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాలు, పోతరాజు, శక్తి స్వరూపిణి అమ్మవారి రూపాన్ని ప్రదర్శించారన్నారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే భోజనమే బోనమని వివరించారు. అద్భుతమైన సంస్కృతిని ప్రదర్శించిన తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్స్‌లో సిద్ధార్థ విద్యార్థులు ఉండటం కళాశాలకు గర్వకారణమన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి



ఎడపల్లి(బోధన్): సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నెహ్రూనగర్ గ్రామంలోని 418 సర్వే నంబర్‌లో పేద ప్రజలు గుడిసెలు వేసుకున్నారు. ఇంటి స్థలాలు లేని వారికి ప్రభుత్వం స్థలాలు కేటాయించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట రాములు మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేదల సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.11 లక్షలు ఇవ్వాలన్నారు. ఎంపీటీసీ ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

రుద్రూర్: బాలల పరిరక్షణ మనందరి బాధ్యతని, వారి సంరక్షణకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్ అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయి బాలల సంరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. బోధన్ సీడీపీవో జానకమ్మ మాట్లాడుతూ.. బాలలను ఇబ్బందులకు గురిచేస్తే 1098 హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో బాల గంగాధర్, ఎంఈవో శాంతకుమారి, మండల వైద్యాధికారి అయేషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారిస్తాం

బోధన్‌టౌన్(బోధన్): మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడదతో పాటు పారిశుధ్య, దోమలు, తాగునీటి పైప్‌లైన్ లీకేజీ, తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆదేశాలను సారం సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే ప్రణాళికలు వేసుకొని ముందుకు సాగుతున్నామని బోధన్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ స్పష్టం చేశారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లోని ప్రజలు తమ సమస్యల గురించి మున్సిపల్ కమిషనర్‌కు చెప్పుకున్నారు. వాటికి ఆయన సమాధానాలిచ్చారు.

సాక్షి ఫోన్ ఇన్



ఖమర్ అహ్మద్,
బోధన్ మున్సిపల్ కమిషనర్

■ పట్టణంలోని రాకాసీపేట్‌లోని 5వ వార్డులో మురికి కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు ఎక్కువగా ఉన్నాయి. -నవీన్‌కుమార్ (5వ వార్డు)
✤ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి మురికి కాలువలను శుభ్రం చేయిస్తాం. వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

■ పట్టణంలో పలుచోట్ల అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించాలి. – ఉదయ్ భాస్కర్ (26వ వార్డు)
✤ పట్టణంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తక్షణమే తొలగించేలా చర్యలు చేపడతాం.

■ ఆచన్‌పల్లి కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. మురికి కాలువలు సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల దోమల సమస్య అతిగా ఉంది. -నవీన్(1వ వార్డు)
✤ మురికి కాలువలను శుభ్రం చేయించి చెత్త చెదారం లేకుండా చర్యలు చేపడుతాం.

■ శక్కర్‌నగర్ కాలనీలోని 3 వార్డులో కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. రాత్రి వేళలో బయటకు రావాలంటే గుంపులుగా ఉన్న కుక్కలను చూసి కాలనీవాసులు భయపడుతున్నారు.
✤ కుక్కల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంది.

■ పట్టణంలోని 29వ వార్డులో పారిశుధ్య సమస్యలతో పాటు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. -చంద్రశేఖర్ (29వ వార్డు)
✤ పట్టణంలోని ప్రతీ వార్డులో మురికి కాలువలు శుభ్రం చేయిస్తున్నాం. దోమల నివారణ చర్యలు చేపడుతాం.

■ శక్కర్‌నగర్ చౌరస్తాలోని డాల్ఫిన్ హోటల్ ముందు పైప్‌లైన్ లీకేజీ అయి 24 గంటలూ తాగునీరు వృథాగా పోతుంది. - ఇండ్ల సూర్యకుమార్ (35వ వార్డు)
✤ పైప్‌లైన్ లీకేజీని అరికట్టి, తాగునీరు వృథా కాకుండా దృష్టి సారిస్తాం.

■ శక్కర్‌నగర్‌కాలనీలో మురికి కాలువ మీద ఇంటి నిర్మాణం చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. -పి. కృష్ణ (23వ వార్డు)
✤ సమస్యను టౌన్ ప్లానింగ్ అధికారులతో వెరిఫికేషన్ చేయించి పరిష్కరిస్తాం.

■ రెంజల్‌బేస్‌కాలనీలో కుక్కల బెడదతో పాటు, పారిశుధ్య సమస్య నెలకొంది. చెత్త సేకరణ ఆటోలు రావడం లేదు. -ఖలీం (36వ వార్డు)
✤ ప్రతీరోజు కాలనీల్లో చెత్త సేకరణ చేయాలని ఇప్పటికే పారిశుధ్య కార్మికులను ఆదేశించాం. చెత్త సేకరణ వాహనాలు వచ్చేలా చర్యలు చేపడతాం.

■ ఎల్‌బీఎస్‌నగర్ కాలనీలో కుక్కలు గుంపులుగా ఉండడం వల్ల పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. -పద్మ (26వ వార్డు)
✤ కుక్కల సమస్యపై ఇప్పటికే ఉన్నత అధికారులు పలు సూచనలు చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తాం.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- ఎంపీ అర్వింద్‌పై బోధన్ ఎమ్మెల్యే షకీల్ విమర్శలు
- మున్సిపల్ వార్డుల్లో రూ.11.50 కోట్ల పనుల ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్: నియోజకవర్గ అభివృద్ధిపై ఎవరితోనైనా బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై ఎమ్మెల్యే ఘాటు విమర్శలు చేశారు. జిల్లాకు, బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి, హిందూ సమాజానికి ఎంపీ చేసిన మేలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఆయన తండ్రి అవినీతికి పాల్పడితే ఎంపీ వసూల్ కింగ్‌గా వ్యవహరించాడని ఆరోపించారు. బతుకమ్మ పండుగకు ప్రపంచ స్థాయి ఖ్యాతి తెచ్చిన ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ స్కాం అంటూ ఇబ్బందులకు గురి చేయాలనే దురుద్దేశంతో అవమానపర్చేలా ఆరోపణలు చేస్తున్నాడని పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పలు మున్సిపల్ వార్డుల్లో రూ.కోటి 60 లక్షల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. స్థానిక గోశాల అభివృద్ధి పనులకు రూ.5 లక్షల మంజూరు పత్రాలను నిర్వాహకులకు అందించారు. అనంతరం తన క్యాంపస్ ఆఫీసులో మాట్లాడారు. పట్టణ, నియోజకవర్గ అభివృద్ధి పనులకు సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) రూ. 11.50 కోట్లు మంజూరయ్యాయని, ఇందులో భాగంగా వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు.

ప్లాట్లు పేదలకు పంపిణీ చేస్తాం

పట్టణంలోని ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలంతో పాటు రూ.3 లక్షలు మంజూరు చేయించి పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. 1500 ప్లాట్లు పంపిణీకి స్థలాన్ని గుర్తించామని, రెవెన్యూ అధికారులు లేవుట్ తయారు చేసే పనిలో ఉన్నారని పేర్కొన్నారు. పాండుతర్పాలో నిర్మించిన 400 డబుల్ బెడ్ రూం ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామని, మరో 300 మందికి వ్యక్తిగత డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయగా అవి నిర్మాణంలో ఉన్నాయని వెల్లడించారు. ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్, ఏఎంసీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు



ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని కలిసిన సంస్థ సభ్యులు

పెర్కిట్(ఆలూర్): ఆలూర్ మండల కేంద్రంలోని మా ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ ట్రస్టు భవనానికి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మంగళవారం రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. బీఆర్ఎస్ ఆర్మూర్ మండల అధ్యక్షుడు ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కళ్లెం భోజారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు హైదరాబాద్‌లో నిధుల మంజూరు విషయమై ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే నిధులను మంజూరు చేశారు. ట్రస్టు కార్యదర్శి గాండ్ల రాంచందర్ పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్‌కు స్థలం, నిధులు..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికు చెందిన 4 పంథాల మున్నూరు కాపు సంఘ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిని కలిశారు. మామిడిపల్లిలో ఫంక్షన్ హాల్‌కు స్థలం, నిధులు కేటాయించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి 2 ఎకరాల స్థలం, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.50లక్షల నిధులు మంజూరు చేశారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తరించాలి



మాట్లాడుతున్న అంజనేయులు

వేల్పూర్ : రెడ్‌క్రాస్ సేవలు గ్రామాల్లోకి విస్తరింపజేయాలని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు పేర్కొన్నారు. వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఏఎంసీలో మంగళవారం నిర్వహించిన ఆర్మూర్ డివిజన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అందరి సహకారంలో జిల్లా నుంచి 17 వేల సభ్యత్వాలు నమోదు కావడంతో నిజామాబాద్‌కు దేశంలో 29వ స్థానం, తెలంగాణాలో రెండవస్థానం లభించినట్లు చెప్పారు. జిల్లా రెడ్‌క్రాస్ సేవలు గుర్తించి సంస్థకు కోటి ఇరవై లక్షలు విలువచేసే బ్లడ్ డోనేషన్ బస్సు, ఫ్రీజ్ బాక్సులను అందించిందని వెల్లడించారు. సంస్థ సేవలు విస్తరించేందుకు మండల, గ్రామ స్థాయిలో, విద్యాసంస్థల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్‌లుగా సభ్యత్వం అందించి వారి సేవలను వినియోగించుకుంటామని చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో త్వరలోనే వృద్ధాశ్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ దొల్ల రాజేశ్వర్‌రెడ్డి, కోశాధికారి కరిపే రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాగా ఏర్పడితేనే అన్ని రంగాల్లో అభివృద్ధి



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా సాధన కోసం కొనసాగుతున్న ఉద్యమానికి పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని న్యాయవాదులు కోరారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటైతే బోధన్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవకాశాలుంటాయని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు ప్రత్యేక జిల్లా కోసం ఆమరణ నిరాహార దీక్షకు కూర్చునేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారని తెలిపారు. ప్రత్యేక జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదుల చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 72వ రోజుకు చేరాయి.

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఆర్మూర్‌టౌన్: ఇటీవల మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రీతి నాయక్ కుటుంబ సభ్యులను ఓదార్చే విధంగా లేవని, మెడికో ప్రీతినాయక్ ఆత్మహత్య ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి రూ.5 కోట్లు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబ సభ్యుల్లో ఒకరి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. వెంటనే సీఎం కేసీఆర్ హోంమంత్రి మహమూద్ అలీని తొలగించాలని పేర్కొన్నారు.

దర్జీలకు పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

రుద్రూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో టైలరింగ్‌పై ఆధారపడి జీవిస్తున్న మేరు కులస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. టైలర్స్‌డే పురస్కరించుకుని మంగళవారం ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ ముజీబ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెడీమేడ్ దుస్తుల వల్ల సరిపడా పనిలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రజక, నాయీ బ్రాహ్మణులకు ఇచ్చినట్టు టైలర్ షాపులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. మేరు సంఘం మండల అధ్యక్షుడు ధర్మపురి, కొలాస్ గంగాధర్ పాల్గొన్నారు.

కోటగిరి మండల కేంద్రంలో..

కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం మేరు సంఘం ఆధ్వర్యంలో టైలర్స్‌డే నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలో టైలరింగ్‌పై ఆధారపడి వంద మేరు కుటుంబాలు ఉన్నాయని, వీరికి ఆర్థిక సహకారాన్ని అందించాలని కోరారు. రూ.2 లక్షల రుణం సదుపాయం, జీవనభృతి కింద ఆసరా పింఛన్ ఇవ్వాలని కోరారు.



కోటగిరిలో టైలర్స్‌డే నిర్వహిస్తున్న మేరు సంఘం సభ్యులు

బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలి



మాట్లాడుతున్న కార్మిక నాయకులు, కార్మికులు

బోధన్: నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కోరారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఫ్యాక్టరీ ప్రధాన గేట్ ఎదుట కార్మికులు సమావేశమయ్యారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంపస్ ఆఫీసుకు వచ్చి ఎమ్మెల్యే షకీల్‌ను కలిశారు. బుధవారం బాన్సువాడకు వస్తున్న సీఎం కేసీఆర్ దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్మిక సంఘాల నాయకులు నాగేశ్వర్‌రావు, బాలక్రిష్ణ, లింగం గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కల్దుర్కిలో పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్



ఫత్తేపూర్‌లో భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సావిత్రి

బోధన్‌రూరల్(బోధన్): కల్దుర్కిలో సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ నారాయణ రావు ప్రారంభించారు. గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టగా సర్పంచ్ నారాయణ ఆధ్వర్యంలో భూమిపూజ చేసి పనులు మొదలుపెట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, ఎంపీటీసీ లక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫత్తేపూర్‌లో జీపీ భవనం పనులు..

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలం ఫత్తేపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మంగళవారం గ్రామంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, సర్పంచ్ అహ్మద్‌లు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ షకీల్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి నసీమ్ సుల్తానా

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ నసీమ్ సుల్తానా సూచించారు. ఆర్మూర్ కోర్టు ఆవరణలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. మొత్తం 150మందికి డాక్టర్ భుజంగ్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్యల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విప్లవ్ కిరణ్, పవన్, సీనియర్ న్యాయవాదులు గంట సదానందం, లోక భూపతిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం వస్తే బీజేపీ నేతలను అరెస్టు చేస్తారా?

– మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

రుద్రూర్: తిమ్మాపూర్ బ్రహ్మోత్సవాలకు సీఎం కేసీఆర్ వస్తుంటే...బీజేపీ నేతలను అరెస్టు చేయడమేమిటని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన బీజేపీ కార్నర్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉదయం నుంచి పలు మండలాల్లో బీజేపీ కార్యకర్తలు, నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఇదేనా ప్రజాపాలన అంటూ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. కేంద్ర పథకాలు సక్రమంగా అమలు చేయకుండా రాష్ట్రం సహకరించడం లేదని ఆరోపించారు. ప్రశ్నించే వారిని అణగదొక్కుతున్నారని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాకు వస్తున్న సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలు గుర్తుకు తెచ్చుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ సెగ్మెంట్ కోకన్వీనర్ భూపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు సుధాకర్‌గౌడ్, వివిధ మండలాల బీజేపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శించి వాటి ఆవశ్యకత గురించి వివరించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. –సాక్షి నెట్‌వర్క్



బోధన్: విజయ సాయి హైస్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్ కుమార్



కోమన్‌పల్లి హైస్కూల్లో బహుమతులతో విద్యార్థులు



కమ్మర్‌పల్లి: కృష్ణవేణి హైస్కూల్లో..



ఆర్మూర్‌టౌన్: శ్రీ చైతన్య పాఠశాలలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



ప్రాజెక్టులను తిలకిస్తున్న నవీపేట ఎస్సై రాజారెడ్డి



కల్దుర్కి జెడ్పీ హెచ్ఎస్‌లో .. ఎంపీడీవో శ్రీనివాస్

బీజేపీని ఆశీర్వదించండి



నవీపేట: రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ బోధన్ నియోజకవర్గ నేత వడ్డీ మోహన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని తడగామ కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తరాదిలో కొన్ని రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాబోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీటీసీ మైస రాధ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్, రామకృష్ణ, శ్రీకాంత్, రచ్చ సుదర్శన్ పాల్గొన్నారు.